# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 339
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
అక్టోబర్ 28, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## సెలవులు రద్దు

- 24/7 అప్రమత్తంగా ఉండాలి
- మెన్ అండ్ మెటీరియల్స్ సిద్ధంగా ఉంచుకోవాలి
- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



# మార్కెట్ వద్దు స్టేడియం ముద్దు

- పరకాలలో అస్తవ్యస్తంగా ప్రజా పాలన
- రెండేళ్లుగా పడకేసిన అభివృద్ధి పనులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న అసంపూర్తి నిర్మాణాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- సమయపాలన పాటించని కమిషనర్



వివరాలు2లో..

పరకాల నియోజకవర్గంలో అభివృద్ధి అటకెక్కింది. అధికారమిస్తే పరకాలను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానంటూ వాగ్దానం చేసిన నాయకుల మాటలు నీటి మూటలు కావడంపై స్థానికులు మండిపడుతున్నారు. గత పాలకుల హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఈ రెండు సంవత్సరాల్లో కొత్తగా చేసిందేమీ లేదంటున్నారు. పట్టణ అభివృద్ధికి కేవలం మున్సిపాలిటీ నిధులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో నిధులు తీసుకురావడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శిస్తున్నారు. పరకాల పట్టణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.10కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టి 80శాతం పనులను పూర్తి చేసింది. తర్వాత అధికారం కోల్పోవడంతో పనులు మధ్యంతరంగానే నిలిచిపోయాయి. అయితే ప్రస్తుత పాలకులు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి పెండింగ్ పనులు పూర్తి చేయించాల్సి ఉన్నప్పటికీ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్దు.. ఇండోర్ స్టేడియం ముద్దు అంటూ ప్రకటనలు చేయడం వివాదాస్పదంగా మారుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను తొలగించి అదే స్థలంలో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తానంటూ ప్రకటించడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. - వరంగల్ వాయిస్, పరకాల



8లో..

## మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- 5 లక్షల కుటుంబాలకు రూ.123 కోట్ల నిధులు మంజూరు
- మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- గణపసముద్రంలో చేప పిల్లల విడుదల



8లో..

## కుడా భూముల విక్రయాలు వద్దు

- వాటిని ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించాలి
- జిల్లా కలెక్టర్ కు వామపక్ష పార్టీల వినతి



2లో..

## వాటాల మీదున్న శ్రద్ధ.. ప్రజల మీద లేదా?

- కలుషిత తాగునీటిపై ప్రజల ఆగ్రహం
- బల్దియా ఎదుట ఆందోళన



2లో..

## హరీష్ రావుని పరామర్శించిన దాస్యం

# మార్కెట్ వద్దు.. స్టేడియం ముద్దు



- పరకాలలో అస్తవ్యస్తంగా ప్రజా పాలన
- రెండేళ్లుగా పడకేసిన అభివృద్ధి పనులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న అసంపూర్తి నిర్మాణాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- సమయపాలన పాటించని కమిషనర్

**వరంగల్ వాయిస్, పరకాల :** అసమర్థ పాలకుల వైఖరిపై పరకాల నియోజకవర్గ ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధికారమిస్తే పరకాలను అభివృద్ధిలో అగ్రగామిగా మారుస్తానన్న పాలకుల మాటలు నీటి మూటలు కావడంపై మండిపడుతున్నారు. గత పాలకుల హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఈ రెండు సంవత్సరాల్లో కొత్తగా చేసిందేమీ లేదంటూ వాపోతున్నారు. పట్టణ అభివృద్ధికి కేవలం మున్సిపాలిటీ నిధులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా తీసుకురాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి అధికారులు ప్రజల సమస్యలను గాలికొదిలి స్థానిక నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్నారని దుయ్యబట్టారు. వారి కనుసన్నల్లోనే పోలీస్ స్టేషన్, తహసీల్దార్, మున్సిపాలిటీ కార్యాలయాల సిబ్బంది పనిచేస్తున్నారని చర్చించుకుంటున్నారు.

### నిర్వీర్యమవుతున్న నిర్మాణాలు..

గత పాలకులు కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన కీలక నిర్మాణ పనులు నేడు నిర్వీర్యం అవుతున్నాయి. గతంలో రూ. 2 కోట్లతో పశువుల సంత మైదానం పక్కన చేపట్టిన మార్కెట్ నిర్మాణం పనులు మధ్యలో ఆగిపోయాయి. దీనిపై అధికారులు, నాయకులకు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో ఈ నిర్మాణం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు, మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. దీనిని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా మారుస్తామంటూ ఎమ్మెల్యే చేసిన ప్రకటన కూడా కార్యరూపం దాల్చకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనుక వేలంపల్లి రోడ్డులో సుమారు రూ. 70 లక్షలతో చిరు వ్యాపారులకోసం చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం సైతం ఆదిలోనే ఆగిపోయింది. నేడు ఈ ప్రాంతంలో పిచ్చి మొక్కల ఏపుగా పెరిగి గంజాయి బ్యాచ్ ఎంజాయ్ చేసేందుకు ఉపయోగపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులకు ఇప్పటికీ మోక్షం లభించలేదు. వార్డుల్లోని సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణాలలో నాణ్యత లోపిస్తున్నా, సంబంధిత కాంట్రాక్టర్లు నాయకులకు దగ్గరి బంధువులు కావడంతో అధికారులు నామమాత్రపు తనిఖీలతో కాలయాపన చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### వివాదాస్పదంగా ప్రకటన..

గత బీఆర్ఎస్ హయాంలో సుమారు రూ. 10 కోట్లతో సకల సౌకర్యాలతో నిర్మించాలని తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు గత రెండు సంవత్సరాలుగా అటకెక్కాయి. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి అయినప్పటికీ మిగిలిన 20 శాతం పనులు చేపట్టేందుకు పాలకులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్దు.. ఇండోర్ స్టేడియం ముద్దు అన్నట్లుగా స్థానిక ఎమ్మెల్యే చేస్తున్న ప్రకటణలు వివాదాస్పదంగా మారుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలను కూల్చివేసి ఇదే ప్రాంతంలో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ కడతానంటూ ఆయన చేస్తున్న ప్రకటణలను ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

### కమిషనర్ నిర్లక్ష్యం..

ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ తన చాంబర్ ఎదుట మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు అందుబాటులో ఉంటానంటూ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ ఏనాడు సమయ పాలన పాటించలేదన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అయన నిర్ణీత సమయంలో ఏ ఒక్కరోజు కూడా లేడని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీతో వివిధ పనుల నిమిత్తం మున్సిపాలిటీకి వచ్చే ప్రజలకు నిరాశే మిగులుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇంచార్జుల పాలనతో అభివృద్ధి కుంటుపడుతోందంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెగ్యూలర్ కమిషనర్ ను నియమించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



### పనులు పూర్తి చేయాలి :

**- విజయపాల్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్**

బీఆర్ఎస్ హయాంలో సుమారు రూ. 10 కోట్లతో అన్ని సౌకర్యాలతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ గా మారుస్తానంటూ ఎమ్మెల్యే ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉంది. కనీస సౌకర్యాలు లేక రోడ్ల మీదే వ్యాపారాలు చేస్తుంటే, ఈ మార్కెట్‌ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆయన వివాదాస్పద ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉంది. గారడీ పాలనలో అస్తవ్యస్తంగా తయారైన పరకాలకు సమర్థవంతమైన కమిషనర్ ను నియమించి ప్రజా పాలన అందించాలి.



### అధ్వానంగా పట్టణ పాలన..:

**- బెజ్జంకి పూర్ణ చారి, మాజీ కౌన్సిలర్**

అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా తయారైంది. మున్సిపాలిటీ అధికారులకు పట్టణ అభివృద్ధిపై చిత్తశుద్ధి లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. స్థానిక ప్రజలు అవసర నిమిత్తం కార్యాలయానికి వెళితే సిబ్బంది సరైన సమాధానం చెప్పేవారే కరువయ్యారు. అధికారులు సైతం సమయ పాలన పాటించడం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.







## హరీష్ రావుని పరామర్శించిన దాస్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు ఇంట్లో విషాదం నెలకొంది. హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మంగళవారం తుది శ్వాస విడిచారు. వయోభారం, అనారోగ్య కారణాలతో ఆయన మఈతి చెందినట్లు కుటుంభ సభ్యులు ప్రకటించారు. సత్యనారాయణ రావు కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన పార్థీవ దేహాన్ని సందర్శనార్థం హైదరాబాద్ కోకాపేటలోని క్రిన్స్ విల్లాస్ లో ఉంచారు. హరీష్ రావును ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ పరామర్శించారు. సత్యనారాయణ పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

## వాటాల మీదున్న శ్రద్ధ.. ప్రజల మీద లేదా ?

- కలుషిత తాగునీటిపై ప్రజల ఆగ్రహం
- బల్దియా ఎదుట ఆందోళన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వాటాలు, వసూళ్ల మీద ఉన్న శ్రద్ధ ప్రజల మీద లేదా అంటూ పలు డివిజన్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దేశాయిపేటలోని ఫిల్టర్ బెడ్ పాడైపోయి గత కొంత కాలంగా ఇంటింటికి మురికి నీరు వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నగరంలోని పలు డివిజన్లలోని మహిళలు ఆగ్రహంతో మురికి నీటిని బాటిళ్లలో తీసుకొచ్చి బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ప్రజా సమస్యలను గాలికొదిలి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో తిరగడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఓట్లేసి గెలిపిస్తే మంత్రి పదవి పొందిన కొండా సురేఖ వరంగల్ కు చేసిందేమీ లేదని మండిపడ్డారు. కనీసం తాగు నీళ్లనైనా అందివ్వలేరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రితో పాటు బల్దియా పాలకవర్గం, అధికారులు ఈ నీటినే తాగుతున్నారా అంటూ నిలదీశారు. వారేమో ఫిల్టర్ వాటర్ తాగుతూ ఓట్లు వేసి గెలిపించిన జనాలకు మాత్రం కలుషితమైన నీటిని సరఫరా చేస్తారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నీళ్లను తాగి అనారోగ్యానికి గురైతే తమకు దిక్కేవరని ప్రశ్నించారు. తాగునీటి కోసం ఇంటింటికీ కొంత డబ్బును సేకరించి అధికారులు, పాలకులకు వాటాల రూపంలో ఇస్తేనే వారు పనులు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం శుభ్రమైన తాగునీరు అందించలేని పాలకులు, అధికారులు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మంతెన అమరేష్, పత్రి సుభాష్, హరిశంకర్, శ్రీనివాస్, శేష స్థానిక మహిళలు తదితరులు పాల్గొనారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, అక్టోబర్ 28, 2025

# 'బీఆర్ఎస్ నేతలు అభివృద్ధి విరోధులు'

■ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బోరబండ డివిజన్‌లో ఉప ఎన్నికల ఇంచార్జ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన కనిపిస్తోందని ఆయన తెలిపారు. పదేళ్లలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. "గతంలో పీజేఆర్ కాంగ్రెస్ హయాంలో జరిగిన పనులు మాత్రమే కనిపిస్తున్నాయి. పదేళ్లలో మీరు చేయని అభివృద్ధి, సంక్షేమం కేవలం రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించింది," అని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ నేతలే వైట్ కలర్ రౌడీయిజంను పెంచి పోషించారని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ని బీఆర్ఎస్ వాళ్లు రౌడీ అనడం దొంగే దొంగ అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిచినా, ఓడినా ప్రజల్లోనే ఉన్నారని ఎమ్మెల్యే నాయిని ప్రశంసించారు. ప్రజాసేవను విస్మరించకుండా, నిరంతరం ప్రజల మధ్యలో ఉన్న వ్యక్తి నవీన్ అన్నారు. "ఈరోజు బోరబండ డివిజన్‌లో ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం అందని ఇల్లు లేదు. అభివృద్ధి విరోధులుగా ఉండే బీఆర్ఎస్ నేతలు ఉప ఎన్నికల్లో అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదం," అని అన్నారు. ఎంతసేపు మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టే తత్వం బీఆర్ఎస్, బీజేపీ పార్టీలదని నాయిని రాజేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. "గతంలో ఇచ్చిన ప్రతి పథకం సొంత కుటుంబ సభ్యులకే ఇచ్చుకొని ప్రజా ధనాన్ని వృధా చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులకు అందేలా అధికార యంత్రాంగంతో కలిసి పనిచేస్తుంది," అని వివరించారు. చిన్న చిన్న గిఫ్ట్‌లతో ప్రజలను మభ్యపెట్టాలని బీఆర్ఎస్ నాయకులు చూస్తున్నారని ఆయన విమర్శించారు. "ప్రతిపక్షంలో ఉన్న మీరే స్థాయిని మరిచి మాట్లాడితే, అన్ని ఉండి కూడా అణుకువతో ఉంటున్నామంటే అది మా చిత్తశుద్ధికి నిదర్శనం" అని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించాలని, ప్రజలకు తాము చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ ఓటు అడగాలని సూచించారు. బాకీ కార్డులతో ప్రజల వద్దకు వెళ్తున్న కేటీఆర్, హరీష్ రావులను పదేళ్లలో విస్మరించిన హామీలను ప్రశ్నించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. "మేము ప్రజలకు బాకీ ఉన్నాం. రానున్న రోజుల్లో ప్రతి హామీని నెరవేర్చుతాం," అని హామీ ఇచ్చారు. చివరగా బోరబండ, జూబ్లీహిల్స్ ప్రజలు వివేకంతో ఆలోచించి ప్రజా ప్రభుత్వ అభ్యర్థి నవీన్ యాదవ్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## పోలీసులు ప్రజల శ్రేయోభిలాషులు



**వరంగల్ వాయిస్, జనగామ :** ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేసే పోలీసులు ప్రజల శ్రేయోభిలాషులు అని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్పష్టం చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా, గాయత్రీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్‌ను కలెక్టర్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఓపెన్ హౌస్‌ను సందర్శించడానికి నగరంలోని పలు విద్యా సంస్థల నుండి విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు నిర్వహిస్తున్న విధులు, వారు వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, వాటి పనితీరు, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ విభాగాల పనితీరును సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది చిన్నారులకు వివరంగా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తమ కుటుంబ క్షేమం కన్నా సమాజ క్షేమం కోసం నిరంతరం శ్రమించేది పోలీసులు మాత్రమేనని అన్నారు. "పోలీసులను మీ స్నేహితులుగా భావించండి. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులను ఎప్పటికీ మరువకూడదు," అని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఏసీపీ పండేరి చేతన్, సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోయిన సెల్‌ఫోన్ అప్పగింత

### బాధితుడికి అండగా పోలీసులు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సుమారు 20 నెలల క్రితం పోగొట్టుకున్న విలువైన సెల్‌ఫోన్‌ను పోలీసులు ట్రేస్ చేసి, బాధితుడికి తిరిగి అప్పగించారు. కాశిబుగ్గకు చెందిన వేముల నాగరాజు అనే వ్యక్తి గత మేడారం జాతర సమయంలో సుమారు రూ.40,000 విలువ చేసే తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని, సెల్‌ఫోన్‌ను ట్రేస్ అవుట్ చేశారు. మంగళవారం ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ సీఐ సుకుర్ చేతుల మీదుగా నాగరాజుకు ఆయన సెల్‌ఫోన్‌ను అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా బాధితుడు వేముల నాగరాజు మాట్లాడుతూ ఇంతకాలం తర్వాత తన ఫోన్‌ను తిరిగి ఇచ్చిన సీఐ సుకుర్, ఎస్సై సందీప్, పోలీస్ సిబ్బంది సందీప్, ఖాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా కార్తీక మాస మహోత్సవాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆధ్యాత్మికంగా అత్యంత శ్రేష్ఠమైన కార్తీక మాసం సందర్భంగా, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) – హనుమకొండ ఆధ్వర్యంలో 'మన గుడి' కార్యక్రమంలో భాగంగా కార్తీక మాస మహోత్సవాలు నిర్వహించనున్నారు. రామ్ నగర్‌లోని భువనేశ్వరి మాత దేవాలయంలో ఈనెల 30 నుంచి నవంబర్ 4 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని టీటీడీ ప్రతినిధి రామ్ రెడ్డి కృష్ణమూర్తి తెలియజేశారు. మంగళవారం ఉదయం దేవాలయ కమిటీ చైర్మన్ మోతుకూరి రామేశ్వరరావు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి కృష్ణమూర్తి ఉత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీని భువనేశ్వరి మాత దేవాలయం ప్రాంగణంలో ఆవిష్కరించారు. కార్తీక మాసంలో ధర్మాచరణ, కార్తీక పౌర్ణమి విశిష్టత వంటి అంశాలపై ఆయా తేదీలలో సాయంత్రం 6:30 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రముఖులచే ప్రవచనాలు, సామూహిక విష్ణు – శివ స్తోత్ర పారాయణములు ఉంటాయని రామ్ రెడ్డి కృష్ణమూర్తి వివరించారు. బ్రహ్మశ్రీ డాక్టర్ గిరిజా మనోహర్ బాబు, తెన్నేటి వసుంధర, బ్రహ్మశ్రీ వంగల సోమయాజులు వంటి సాహితీ దిగ్గజాలచే ప్రవచనాలు ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని ఆలయ కమిటీ చైర్మన్ మోతుకూరి రామేశ్వరరావు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ఉత్కృష్టమైన ఉత్సవాలు భువనేశ్వరి మాత దేవాలయంలో నిర్వహించే అవకాశం కల్పించడం హర్షణీయమని కార్యక్రమాల సమన్వయకర్త గుండవరం విధు మౌళి అన్నారు. కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు అద్దంకి సారంగా చారి, పడాల సారంగపాణి, బోయినపల్లి ప్రభాకరరావు, పద్మజ, నరసింహారెడ్డి, గట్టు సత్యనారాయణ, నామా రాజేందర్, భద్రకాళి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు శ్రవణ్ రెడ్డి, ఆలయ కార్యక్రమాలకు సహకరిస్తున్న అంబటి నరసయ్య, తాడూరి సుధాకర్, ఆలయ అర్చకులు బ్రాహ్మణపల్లి శంకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మాల కుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని మర్రిపెల్లిగూడెం గ్రామంలో మాల కుల సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కుల సభ్యులంతా హాజరైన ఈ సమావేశంలో, సంఘం అభివృద్ధికి కృషి చేసే నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బావుండ్లపెల్లి సురేందర్, ఉపాధ్యక్షుడిగా సదువాల ఐలయ్య, కోశాధికారిగా కోడెం నరేష్, కార్యదర్శులుగా పసుల మొండయ్య, సదువాల నరేష్, చెనమళ్ల పైడయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల ప్రక్రియలో, గౌరవ అధ్యక్షులుగా కోడెం రమేష్, చెనమళ్ల రమేష్ లు ముఖ్య అతిథులుగా హాజరై, నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. గ్రామ మాల కుల సభ్యులందరూ ఈ కార్యక్రమానికి హాజరై నూతన కమిటీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

## ఐక్యత పరపతి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

### అధ్యక్షుడిగా కుక్కల రాజు ఏకగ్రీవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక గుండ్ల సింగారం జీవీఎస్ఆర్ కాలనీకి చెందిన ఐక్యత పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కాలనీ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం లక్ష్యంగా నూతన బాధ్యతలను స్వీకరిస్తూ ఈ కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. నూతనంగా ఐక్యత పరపతి సంఘం అధ్యక్షుడిగా కుక్కల రాజు, ఉపాధ్యక్షులుగా రుద్రారం ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా తాండూర్ గోపి, ముఖ్య సలహాదారుడుగా కుక్కమూడి వంశీ, కోశాధికారిగా వైనాల యాకయ్య, కార్యవర్గ సభ్యులుగా మల్లయ్య, విజేందర్, యుగంధర్, రాము, సుమన్, యుగంధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కుక్కల రాజు మాట్లాడుతూ తనకు ఈ ముఖ్య బాధ్యతను అప్పగించిన కాలనీవాసులకు, కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. "నాకు ముందు ఉన్న బాధ్యత కాలనీ అభివృద్ధి పనులే. కాలనీలో ఉన్న సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కాలనీ సభ్యులందరినీ కలుపుకుంటూ ముందుకు సాగుతాను. అంతేకాకుండా, పొదుపు సంఘం అభివృద్ధికి నా వంతు నిరంతరం కృషి చేస్తాను. సభ్యులందరి ఐక్యతతో కాలనీ అభివృద్ధికి పాటుపడతానని ఆయన పేర్కొన్నారు.

## రైతులకు మద్దతు ధరే భరోసా



**వరంగల్ వాయిస్, నడికూడ :** రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం నడికూడ మండలం రామకృష్ణాపురం గ్రామంలో పౌర సరఫరాల సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఐకేపీ) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ... రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. "కొనుగోలు కేంద్రాల్లోనే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభిస్తుంది. రైతులెవరూ నష్టపోకూడదు," అని ఆయన స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, గన్నీ బ్యాగుల కొరత లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం, ధాన్యం కొనుగోలు ధరలను ఆయన వెల్లడించారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ. 2,389, కామన్ రకం ధాన్యానికి రూ. 2,369, సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన మేరకు రూ. 500 బోనస్ అందిస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం నిబంధనల ప్రకారం ధాన్యంలో 17శాతం తేమ (మాయిశ్చర్) శాతం ఉండాలని ఆయన రైతులకు తెలియజేశారు.

# టీకాలతో పశువుల్లో రోగ నిరోధక శక్తి

• రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**వరంగల్ వాయిస్, రేగొండ :** పశువులకు సకాలంలో గాలికుంటు నివారణ టీకాలు వేయించడం ద్వారా వాటిలో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటాయని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గం, రేగొండ మండల కేంద్రంలో పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమం, గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి శ్రీహరి మాట్లాడుతూ గాలికుంటు వంటి వ్యాధులు పశువుల పాల ఉత్పత్తితో పాటు రైతుల ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. ప్రతి ఒక్క రైతు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథంలో పయనిస్తోందని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కుల గణన చేపట్టామని, తమ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని పునరుద్ఘాటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 3 కోట్ల 24 లక్షల పశువులకు 54 లక్షల టీకాలు వేయడం జరిగింది. త్వరలోనే రాష్ట్రంలో గాలి కుంట వ్యాధిని శాశ్వతంగా రూపుమాపుతాం అని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ పశు సంపద తోడు ఉంటేనే వ్యవసాయం మరింత అభివృద్ధి చెందుతుందని, ఇళ్లలో పశుసంపద ఉంటే ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ముఖ్యంగా చూడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించడం తప్పనిసరి అని రైతులను కోరారు. పశువులకు సరైన పోషకాలు కలిగిన దాణా, మేత అందిస్తే పాల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ చేనేత కార్మికుడి మృతి

నివాళులర్పించిన చిప్ప వెంకటేశ్వర్లు నేత



**వరంగల్ వాయిస్, మట్టెవాడ :** సీనియర్ చేనేత కార్మికుడు, ది.షతరంజి చేనేత సహకార సంఘం సభ్యుడు అయిన దాసరి రాం నారాయణ (73) మృతిపట్ల టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం 8:45 నిమిషాలకు రాం నారాయణ స్వర్గస్తులైన వార్త తెలుసుకున్న చిప్ప వెంకటేశ్వర్లు నేత, వెంటనే ఆయన ఇంటికి వెళ్లి, పూలమాలతో నివాళులు అర్పించారు. దివంగత దాసరి రాం నారాయణ భార్య వెంకటలక్ష్మీ చేనేత కార్మికురాలుగా, కుమారుడు ప్రసాద్ స్వయం ఉపాధితో జీవిస్తున్నారు. ఈ సందర్భంగా చిప్ప వెంకటేశ్వర్లు నేత తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'త్రిఫ్ట్ పథకం'లో రాం నారాయణ సభ్యులుగా ఉన్నందున, చేనేత బీమా ద్వారా వారి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం, అలాగే దహన సంస్కారాల నిమిత్తం రూ. 25 వేలు తక్షణమే మంజూరు చేయాలని వరంగల్ చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు శ్రీకాంత్ రెడ్డికి ఫోన్ ద్వారా సూచించారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దామెర సర్వేష్, సహకార సంఘం పర్సన్ ఇంచార్జ్ కొలిపాక మదనయ్య, దాసరి రాజయ్య, ఆడెపు శ్రీనివాస్, దాసరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు అన్యాయం చేసిన బీఆర్ఎస్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** తెలంగాణ రాష్ట్ర సాధన నినాదాలైన 'నీళ్లు, నిధులు, నియామకాల'ను బీఆర్ఎస్ ప్రభుత్వం తుంగలో తొక్కి, యువతకు తీవ్ర అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మిర్యాల కుమార్ విమర్శించారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాల కుమార్ మాట్లాడుతూ 1200 మంది బలిదానంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక, 'నీళ్లు, నిధుల' పేరుతో లక్షల కోట్లు కొల్లగొట్టిందని ఆరోపించారు. నియామకాల విషయంలో ప్రభుత్వ ఉద్యోగాలకు మూడు సంవత్సరాల వయోపరిమితిని పెంచి, లక్షలాది మంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టారని కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను కూడా దొంగ ఏజెన్సీలకు కట్టబెట్టి, చదువుకున్న యువకులకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను తక్షణమే తొలగించి, పారదర్శక నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు గుండెబోయిన అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్జీఎఫ్ఐ బ్యాడ్మింటన్ సెలక్షన్స్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎల్.బీ కళాశాల వేదికగా అండర్-19 ఎస్జీఎఫ్ఐ బ్యాడ్మింటన్ సెలక్షన్, టోర్నమెంట్ మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్ రవీందర్ తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. స్పోర్ట్స్ కమిటీ సభ్యులు రమణా రెడ్డి, మధుకర్ రావు, రఘు వెందర్ రెడ్డి, డాక్టర్ సదానందం, పీడీలు (ఫిజికల్ డైరెక్టర్స్) ఏవీవీ జూనియర్ కాలేజీ పీడీ డాక్టర్ బరుపాటి గోపి, వరంగల్ జూనియర్ కాలేజీ పీడీ ఎం.రమణ, ఎల్.బీ.కాలేజీ పీడీ ఎడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఆకుల రాజేందర్ విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని టీఎన్జీవోస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు, జిల్లా జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ కేంద్రాన్ని కోరారు. నాంపల్లిలోని టీఎన్జీవోస్ భవన్‌లో కేంద్ర సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ అధ్యక్షతన జరిగిన కేంద్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను కేంద్ర సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. వాటిలో ముఖ్యమైనవి. రిటైర్ అయిన ఉద్యోగులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి.ఉద్యోగుల హెల్త్ కార్డులు పూర్తిస్థాయిలో అమలు పరచాలి. సీపీఎస్ సాధన, ఇతర ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే హనుమకొండ జిల్లాలో సభ ఏర్పాటు చేయాలని కేంద్ర సంఘ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు... జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యోగులతో సభ ఏర్పాటు చేస్తామని రాజేందర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల నేతలు రాము నాయక్, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో కార్తీక మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో 108 దీపాలంకరణతో ఏర్పాటు చేసిన నందీశ్వర శివుని పూజలో భక్తులు పాల్గొన్నారు. భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి, అమ్మవారిని దర్శించుకుని తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ పూజారి మారుపాక శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ కార్తీక మాసంలో వ్రతం ఆచరించడం వల్ల సకల పాపాలు తొలగిపోయి, కుటుంబంలో సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని తెలిపారు. హర హర మహాదేవ శంభో శంకర... ఓంకార నాదంతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. శివకేశవులకు ప్రీతికరమైన ఈ మాసంలో పూజలు అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కటాక్షాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజలో కూర్చున్న దంపతులు దూడల రమేష్- శోభారాణి భక్త బృందం లగిశెట్టి పద్మావతి, దూడల నిషిత, తూముకుంట్ల వెంకట నర్సింహారెడ్డి, పెండ్లి సత్తిరెడ్డి, దోసపాటి శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, గట్టు రాధాకృష్ణ, అయిత జయరాములు, లకావత్ స్వామి, అనంతరాములు, రాంచంద్రారెడ్డి, తూముకుంట్ల విజయ, పోగుల కవిత, దోసపాటి శ్రీలక్ష్మి, కన్న జ్యోతి, మాదారపు కల్పన, ఆలేటి పద్మ, సంబోజు జ్యోతి, కందాటి సునీత, గూడెల్లి సంధ్య, బోగ మౌనిక, భాగ్యలక్ష్మి, స్వర్ణలత, నిరోషా తదితరులు పాల్గొన్నారు.

## చేతగాని ప్రభుత్వం కాంగ్రెస్



బీజేపీ నాయకుల నిరసన ర్యాలీ

**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన దాదాపు రెండేళ్లు గడిచినా అమలు చేయలేకపోవడంపై భారతీయ జనతా పార్టీ మండల శాఖ తీవ్రంగా మండిపడింది. కాంగ్రెస్ ప్రజా పాలన చేతగాని ప్రభుత్వం అని బిజెపి మండల అధ్యక్షుడు నరహరశెట్టి రామకృష్ణ విమర్శించారు. మోసపూరితమైన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ వైఫల్యానికి నిరసనగా మంగళవారం మంగళవారం బీజేపీ శ్రేణులు మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి ఆధ్వర్యంలో శాయంపేట మండల కేంద్రంలోని చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ, మొగిలి మాట్లాడుతూ 100 రోజుల్లోనే గ్యారెంటీలు సహా 420 దొంగ హామీలు నెరవేరుస్తామన్న కాంగ్రెస్, ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని అన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు సహా అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసగించిందని ఆరోపించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రతి గ్రామం, వాడలో ఎత్తిచూపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పు రాజు, సీనియర్ జిల్లా నాయకులు బాసని విద్యాసాగర్, వనం దేవరాజ్, కోడెపాక సంజీవరావు, మాజీ మండల అధ్యక్షుడు గడ్డం రమేష్, జిల్లా యువ మోర్చా కార్యదర్శి లడే శివ, ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి, మామిడి విజయ్ మండల ఉపాధ్యక్షుడు కోమటి రాజశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్ రెడ్డి, బూత్ అధ్యక్షులు మునుకుంట్ల చంద్రమౌళి, పున్నం సాంబయ్య, కన్నెబోయిన రమేష్, మంద మధు, చెక్క దినేష్, ఎర్ర తిరుపతిరెడ్డి, గొలుసు రాజు తదితరులు పాల్గొన్నారు.

5
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, అక్టోబర్ 28, 2025

# విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు

■ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఏ సమాజానికైనా అత్యంత కీలకమైన విద్యారంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యల సుడిగుండంలోకి నెట్టి భ్రష్టు పట్టిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జాతీయ ఉపాధ్యక్షులు ఎన్. ఎ. స్టాలిన్ విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హిమాయత్ నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి, పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం-2020 రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, ఇది విద్య కార్పొరేటీకరణ, కేంద్రీకరణ, కాషాయికరణకు దారితీస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్.ఎ. స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఉద్ధరిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ విద్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, విద్యా శాఖ మంత్రిని కూడా నియమించలేని దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 8,300 కోట్లు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, దీంతో లక్షలాది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్ర సర్కారు పెండింగ్ ఫీజులు చెల్లింపులు చేయకపోతే విద్యార్థుల చదువులు కొనసాగేదెలా?" అని ఆయన ప్రశ్నించారు. నవంబర్ 3 నుంచి నిరవధిక సమ్మెకు నోటీస్ ఇచ్చిన యాజమాన్య సంఘాలతో ప్రభుత్వం చర్చించి, విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలని, అలాగే బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటికాల రామకృష్ణ, గ్యార నరేష్, రహమాన్, గ్యార క్రాంతి, సి.రాజు, రాష్ట్ర నాయకులు జేరిపోతుల జనార్ధన్, మచ్చ రమేష్, భాషబోయిన సంతోష్, నెల్లి సత్య, అక్రమ్, అజిత్, ప్రీతమ్, దిడ్డి పార్థసారథి, మూడవత్ పవన్, ప్రణీత్ గౌడ్, ప్రవీణ్, బి. ప్రేమ్ కుమార్, దినాకర్, అనిల్, హరీష్, దత్తు రెడ్డి, ప్రవీణ్, చరణ్ పాల్గొన్నారు.

# పత్తి ఆన్‌లైన్ బుకింగ్ విధానం రద్దు చేయాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** పత్తి పంట కొనుగోలుకు ప్రవేశపెట్టిన కిసాన్ కపాస్ యాప్ ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, సీసీఐ నేరుగా కొనుగోలు చేపట్టాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం నడికూడలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత సీజన్‌లో పత్తి అమ్మకాలకు ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చాలా మంది రైతులకు స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, మరికొందరికి యాప్ పనిచేయకపోవడం, బుకింగ్ మెసేజ్ రాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వర్షాలు, తెగుళ్ల వల్ల ఇప్పటికే పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పుడు కురుస్తున్న వర్షాల కారణంగా పత్తి రంగు మారిందనే సాకుతో ప్రైవేట్ వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారని కిషన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, రైతులు నేరుగా సీసీఐ కొనుగోలు కేంద్రానికి వెళ్లి పత్తిని అమ్ముకునే అవకాశాన్ని కల్పించాలి. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తికి కనీస మద్దతు ధరను రూ. 10,000/- చెల్లించాలి. రైతు తన సమయం, సౌకర్యానికి అనుగుణంగా పత్తి కొనుగోలు చేపట్టేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పాకాల ఏరుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 20 కోట్లు మంజూరు

## కేంద్ర మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లా ఇల్లందు నియోజకవర్గం గార్ల మండల పరిధిలోని పాకాల (మున్నేరు) ఏరుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులు కేంద్ర ప్రభుత్వం సీఆర్ఐఎఫ్ పథకం కింద కేటాయించడం జరిగింది. ఎన్నో ఏళ్లుగా బ్రిడ్జి లేక రాంపురం, మద్దివంచ తదితర గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి, గార్ల మండల బిజెపి శ్రేణులు కేంద్ర మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకువెళ్లారు. వారి విజ్ఞప్తి మేరకు మంత్రి వెంటనే స్పందించి ఈ నిధులను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా గార్ల మండల ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతూ బిజెపి శ్రేణులు బండి సంజయ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి విమల్ కుమార్ జైన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జంపాల శ్రీను, ఇల్లందు నియోజకవర్గ కో-కన్వీనర్ నాగరాజు, గార్ల మండల అధ్యక్షులు నక్క శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేయూ క్యాంపస్ మాదక ద్రవ్య రహిత ప్రాంగణం

## రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌ను మాదక ద్రవ్య రహిత ప్రాంగణంగా కొనసాగించాలని రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం అన్నారు. యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ (కో-ఎడ్యుకేషన్) సెమినార్ హాల్‌లో "నషా ముక్త్ భారత్ అభియాన్" 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మాదక ద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సంక్షేమ శాఖ, మాదక ద్రవ్య నియంత్రణ విభాగం మరియు కేయూ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు సంయుక్తంగా నిర్వహించాయి. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలు మరియు వాటి పర్యవసానాలను విద్యార్థులకు వివరించారు. డా.అనితా రెడ్డి (కేయూ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు) మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవన శైలిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. అప్పయ్య, జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి, మాదక ద్రవ్య నియంత్రణ విభాగం డీఎస్పీ రమేశ్ కుమార్, ఎస్ఐ రవీందర్ తదితరులు మాదక ద్రవ్య వ్యసనానికి సంబంధించిన చట్టాలు, నిబంధనలు, చట్టపరమైన పరిణామాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈ. నారాయణ పాల్గొన్నారు. అధ్యాపకులు, జిల్లా అధికారులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు చురుకుగా పాల్గొని, మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలనే తమ ప్రతిజ్ఞను పునరుద్ఘాటించారు.

# పోలీసుల త్యాగాలను స్మరించుకోవాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని డోర్నకల్‌లో మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. డోర్నకల్ సీఐ చంద్రమౌళి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి ఈ ర్యాలీని పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వంశీధర్, గడ్డం ఉమా, పాషా, హెచ్ఎం బండి నర్సింహా రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే బుకింగ్ సెంటర్ వద్ద సీఐ చంద్రమౌళి మాట్లాడుతూ... విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశానికి పోలీస్ అమరవీరులు చేసిన త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. ప్రజా రక్షణ, భద్రత, లా అండ్ ఆర్డర్ అమలులో పోలీసులు అందిస్తున్న సేవలను ఆయన వివరించారు. ప్రజలు శాంతి భద్రతల కోసం పోలీసులతో కలిసి నడవాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో టీచర్లు అప్పిరెడ్డి, విద్యాసాగర్, అనిత, సమిత, సలోమీ, పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు 'భరోసా'

## రూ. 1.70 లక్షల చెక్కుల అందజేత



**వరంగల్ వాయిస్, పరకాల :** ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ తమ సభ్యుల కుటుంబాలకు అండగా నిలిచింది. అసోసియేషన్ ప్రవేశపెట్టిన '10 కుటుంబ భరోసా స్కీము' కింద ఇటీవల మరణించిన ఇద్దరు సభ్యుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. పరకాల మండల అసోసియేషన్ శాశ్వత సభ్యులుగా ఉన్న రాధాకృష్ణ (12-02-2025న మరణించారు), ఎస్. శ్రీకాంత్ (17-02-2025న మరణించారు) కుటుంబాలకు ఈ సహాయం అందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు గాదె లింగమూర్తి చేతుల మీదుగా, మృతి చెందిన ఇద్దరి కుటుంబాలకు కలిపి మొత్తం రూ. 1,70,000 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల అధ్యక్షులు, ఫొటో, వీడియోగ్రాఫర్స్ కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు, కుటుంబ భరోసా ఇంచార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఆర్‌జేసీ కళాశాల సర్వోత్సవాలు

◆ డిసెంబర్ 13, 14న నాగార్జునసాగర్‌లో నిర్వహణ



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (ఏపీఆర్‌జేసీ) సర్వోత్సవాలను డిసెంబర్ 13, 14న నాగార్జునసాగర్ విజయపురి సౌత్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఏపీఆర్‌జేసీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ మారెళ్ల అంజి రెడ్డి తెలిపారు. బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ కళాశాల 1975లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి, పూర్వ ప్రధాని పీవీ నరసింహారావు ప్రోత్సాహంతో స్థాపించబడిందని గుర్తు చేశారు. గురుకుల పాఠశాలలు, గురుకుల కళాశాలల స్థాపనలో పీవీ నరసింహారావు పాత్ర అనిర్వచనీయమైనదని అంజి రెడ్డి కొనియాడారు. ఏపీఆర్‌జేసీ బైపీసీ, ఎంపీసీ, సీఈసీకి చెందిన విద్యార్థులను మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేసి, సమాజానికి ఎంతో మంది నిష్ణాతులను, ప్రముఖులను తీర్చిదిద్దిన ఘనత ఈ కళాశాలకు సొంతమని తెలిపారు. అనంతరం, డిసెంబర్ 13, 14 తేదీల్లో జరగనున్న ఏపీఆర్‌జేసీ కళాశాల సర్వోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రామక శ్రీనివాస్, ఆర్డీవో కన్నం నారాయణ (పరకాల), చార్టెడ్ అకౌంటెంట్ చంచల్ అగర్వాల్, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శడ్మాకి స్వామి, వెటర్నరీ డాక్టర్ డాక్టర్ వల్లే రాజు పాల్గొన్నారు.

# జక్కలొద్దీ గుడిసెవాసులకు పట్టాలిచ్చి, ఇండ్లు నిర్మించాలి

## ■ సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నాగయ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జక్కలొద్దీ గుడిసె సెంటర్‌లో నివసిస్తున్న పేద ప్రజలకు ప్రభుత్వం తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి, పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పేద ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. మంగళవారం ఉదయం రామ సందీప్ అధ్యక్షతన జక్కలొద్దీ గుడిసె సెంటర్‌లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జి. నాగయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగయ్య మాట్లాడుతూ జక్కలొద్దీ గుడిసె సెంటర్ ఏర్పడి మూడున్నర సంవత్సరాలు అవుతున్నా, దానిని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఇక్కడ నివసిస్తున్న పేద ప్రజలంతా (ఎస్సీలు, బీసీలు, మైనార్టీలు) కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించిన వారేనని గుర్తు చేశారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ గెలిస్తే పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ గెలిచాక ఆ హామీల అమలు కోసం ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం చాలా దారుణమని అన్నారు. సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నళిగంటి రత్నమాల, సింగారపు బాబు, ఆరూరి కుమార్ మాట్లాడుతూ. సీపీఎం పార్టీ పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని తెలిపారు. గుడిసె వాసులకు తక్షణమే మంచినీరు, రోడ్లు, కరెంటు సౌకర్యం కల్పించాలని, ఇల్లు కట్టుకున్న వారికి హోల్డర్ నంబర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుడిసె వాసుల అభివృద్ధి కోసం జరిగే పోరాటంలో ప్రజలందరూ ఐకమత్యంగా పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్. రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు వల్ల దాసు దుర్గయ్య, నాయకులు సాంబమూర్తి, ఉసిల్ల కుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శివపార్వతుల కళ్యాణం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలోని పంచకూట మహాదేవ స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పంచకూట మహాదేవ స్వామి పునఃప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఈ వేడుకను నిర్వహించింది. మంగళవారం ఉదయం ఆలయ అర్చక బృందం స్వామి వారికి గణపతి హోమం, రుద్రాభిషేకం, మహాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పాలకుర్తి రవి శర్మ, శ్రావణ్ శర్మల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం మహానదాన కార్యక్రమాన్ని నిర్వహించడంతో ఆలయం భక్తజనంతో కిటకిటలాడింది. భక్తులు 'ఓం నమశ్శివాయ శంభో శంకర' అంటూ శివనామస్మరణలో మునిగితేలారు. కల్యాణం అనంతరం గ్రామంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. డీజే పాటలు, భక్తుల కోలాటాల మధ్య సాగిన ఈ శోభాయాత్రతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చిన్న వడ్డేపల్లి చెరువు కట్టపై నిర్మించిన శ్రీ బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. కాశిబుగ్గ ముదిరాజ్ అధ్యక్షుడు బిల్ల శివ శంకర్ ముదిరాజ్ నేతృత్వంలో ఈ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రతిష్ఠించబోయే అమ్మవారి విగ్రహానికి జలాధివాసం నిర్వహించే నిమిత్తం, ముదిరాజ్ కులస్తులందరూ పాల్గొన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక బిందె చొప్పున మొత్తం 108 బిందెలతో నీళ్లను సేకరించి, మహిళలు ఘనంగా ఊరేగింపు ర్యాలీగా బయలుదేరారు. ఈ కార్యక్రమానికి వరంగల్ అర్బన్ ముదిరాజ్ అధ్యక్షుడు బయ్యా స్వామి ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాశిబుగ్గ ముదిరాజ్ సంఘం సభ్యులందరూ ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలోని 4వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. స్కూల్ కాంప్లెక్స్ రాయపర్తి ప్రధానోపాధ్యాయులు నూతి వేణుగోపాలస్వామి ఈ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల స్వామి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానంలో నిలవాలని, గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దేవా, సుమారు రూ. 3,000/– విలువ గల స్టడీ మెటీరియల్‌ను సొంత ఖర్చులతో విద్యార్థులకు అందించడం పట్ల వేణుగోపాల స్వామి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ... గురుకుల పాఠశాల 2026 ఎంపిక కోసం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో దీర్ఘకాలిక శిక్షణ ఇస్తున్న తరుణంలో, విద్యార్థులకు సౌలభ్యం కోసం స్టడీ మెటీరియల్ అందించిన సహచర ఉపాధ్యాయులు దేవాను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కంచరాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ, శరత్ గౌడ్ పాల్గొన్నారు.

# డా.బైరి నిరంజన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఉద్యమకారుడు, సినీ సామాజిక రచయిత, కాకతీయ విశ్వవిద్యాలయం అధ్యాపకుడైన డాక్టర్ బైరి నిరంజన్ కి బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్ తమ ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాగా, డాక్టర్ బైరి నిరంజన్ తమ జన్మదినం సందర్భంగా అనాథాశ్రమంలో పండ్లను పంపిణీ చేసి, తమ సేవాభావాన్ని చాటుకున్నారు.

# రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, పరకాల :** పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పరకాల డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక డీపీఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు రక్తదానం చేయగా, పోలీస్ సిబ్బంది కూడా సేవాస్ఫూర్తితో ముందుకు వచ్చి దాదాపు 140 మంది రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో పరకాల సీఐతో పాటు దామెర, ఆత్మకూరు, శాయంపేట సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

## ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** కబడ్డీ, వాలీబాల్ పోటీలలో పాల్గొని జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను తొర్రూర్ మండలం, సెయింట్ సావియో ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ మంగళవారం అభినందించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామంలో ఇటీవల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన 69వ ఎస్జీఎఫ్ఐ క్రీడోత్సవాల్లో సెయింట్ సావియో స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొత్తం పది మంది విద్యార్థులు పాల్గొని విజయం సాధించారు. వీరిలో ఐదుగురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులకు 8 గోల్డ్ మెడల్స్‌తో పాటు రెండు సిల్వర్ మెడల్స్ లభించాయి. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ఆలోచన, సృజన పెంచాలి

## ◆ కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** నూతన పాఠ్య ప్రణాళిక విద్యార్థుల ఆలోచన, సృజన మరియు భాషా నైపుణ్యాలు పెంచే దిశగా ఉండాలని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. ఆంగ్ల విభాగం సెమినార్ హాల్‌లో డాక్టర్ ఆర్. మేఘనా రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన "డిపార్ట్‌మెంటల్ కాన్ఫరెన్స్"కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పాఠ్యపుస్తకం ఆవిష్కరణ: అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం రూపొందించిన కొత్త పాఠ్యపుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. కృత్రిమ మేధా (ఏఐ) యుగంలో సాఫ్ట్ స్కిల్స్ పాత్రను మరువకూడదని అన్నారు. ఆంగ్ల భాషా నైపుణ్యంతో జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా "ఇంగ్లీష్ ఫర్ బ్రిలియన్స్" అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇందులో లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ టెక్నిక్స్ పొందుపరిచినట్టు డాక్టర్ బి. దీపా జ్యోతి తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ... ప్రాక్టీస్ ద్వారా మాత్రమే ఆంగ్ల భాషపై ఉన్న భయం తొలగిపోతుందని అన్నారు. పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్ మాట్లాడుతూ... ప్రస్తుత పోటీ యుగంలో జీవ, జీవన నైపుణ్యాలకే ప్రధాన భూమిక ఉంటుందని తెలిపారు. డాక్టర్ సుకుమారి మాట్లాడుతూ లిజెనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ టెక్నిక్స్ టెక్నిక్స్ ద్వారానే భాషపై పూర్తి పట్టు సాధ్యమని అన్నారు. పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు పి. నిర్మల క్రెడిట్స్, సిలబస్‌లో వచ్చిన మార్పుల గురించి వివరించారు. ఈ సందర్భంగా అతిదుల చేతుల మీదు "ఇంగ్లీష్ ఫర్ బ్రిలియన్స్" అనే పుస్తకం ఆవిష్కరించారు, ఇందులో లిజెనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ టెక్నిక్స్ పొందుపరిచినట్టు డాక్టర్ బి.దీపా జ్యోతి వెల్లడించారు.



# ఉప్పెన లెవల్లో డ్యూడ్ విజయం



మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ కొత్త దర్శకులకు దన్నుగా నిలుస్తారనే విషయం మరోసారి రుజువైంది. అప్పట్లో వైష్ణవ్ తేజ్ , కృతిశెట్టిని హీరోహీరోయిన్లుగా పరిచయం చేస్తూ మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ 'ఉప్పెన' సినిమాను నిర్మించింది. ఆ మూవీతో బుచ్చిబాబు సానా దర్శకుడిగా పరిచయం అయ్యాడు. కొత్త వాళ్ళతో తీసిన 'ఉప్పెన' సినిమా ఘన విజయాన్ని సాధించింది. ఏకంగా వంద కోట్ల గ్రాస్ ను వసూలు చేసింది. సింగిల్ లాంగ్వేజ్ లోనే ఆ సినిమా ఆ రికార్డ్ ను సాధించడం విశేషం. ఓ కొత్త హీరో, హీరోయిన్ల సినిమా ఆ స్థాయి వసూళ్ళను గతంలో ఎప్పుడూ చేయలేదు. అయితే దానిని నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థే ఇప్పుడు అదే రికార్డ్ ను రిపీట్ చేసింది. ప్రదీప్ రంగనాథన్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ 'డ్యూడ్' మూవీని నిర్మించింది. దీపావళి కానుకగా విడుదలైన ఈ సినిమాతో కీర్తీశ్వరన్ దర్శకుడిగా పరిచయం అయ్యాడు. గతంలో ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించి 'లవ్ టుడే', 'డ్రాగన్' చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయి. ఇప్పుడు 'డ్యూడ్' సైతం చక్కని విజయాన్ని అందుకుని అతనికి హ్యాట్రిక్ ను అందించింది. ఈ సినిమా ఇంతవరకూ వంద కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసినట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దాంతో చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సైతం హర్షం వ్యక్తం చేసింది. 'ఉప్పెన' తర్వాత నూతన దర్శకుడితో తాము తీసిన 'డ్యూడ్' సైతం వందకోట్ల గ్రాస్ వసూలు చేయడం ఆనందంగా ఉందని, రాబోయే రోజుల్లోనూ కొత్త దర్శకులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తామని తెలిపింది.





## ఖైదీ మూవీకి 42 ఏళ్లు

అగ్ర కథానాయకుడు చిరంజీవి కెరీర్‌లోని హిట్ సినిమాలు అనగానే గుర్తొచ్చే మొదటి పేరు 'ఖైదీ'. 1983లో విడుదలైన ఈ చిత్రం చిరంజీవిని స్టార్ హీరో చేసింది. 'ఖైదీ' విడుదలై నేటికి 42 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చిరంజీవి టీమ్ ఓ స్పెషల్ వీడియోను పంచుకుంది. తెలుగు సినిమా చరిత్రలో మార్పు తీసుకువచ్చిన పేరు 'ఖైదీ అని పేర్కొంది. ఈ సినిమా అప్పట్లో సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. ఇందులో చిరు సరసన మాధవి నటించింది. మిగతా పాత్రల్లో రావుగోపాలరావు, నూతన్ ప్రసాద్, రంగనాథ్, సంగీత తదితరులు నటించారు.



## మీకేమి అనిపిస్తుందో అదే నిజం..



- ఎంగేజ్‌మెంట్‌పై రష్మిక ఆసక్తికర సమాధానం
- ఎప్పుడు చెప్పలో అప్పడే చెబుతానంటూ రిప్లై

విజయ్ దేవరకొండతో తన ఎంగేజ్‌మెంట్ పై నటి రష్మిక ఆసక్తికర సమాధానం చెప్పి తప్పించుకున్నారు. రష్మిక తాజాగా ఓ ప్రెస్‌మీట్‌లో రష్మికను ఓ అభిమాని విజయ్‌తో నిశ్చితార్థం గురించి అడిగారు. దానికి ఆమె ఆసక్తికర సమాధానం ఇచ్చారు. ఎప్పుడు చెప్పాలో అప్పుడే చెబుతాను. ఈ విషయంలో మీకు ఏమనిపిస్తుందో అదే నిజం' అని అన్నారు. ప్రస్తుతం రష్మిక 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా ప్రచారంలో బిజీగా ఉన్నారు. నవంబర్ 7న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మీడియా సమావేశాల్లో పాల్గొంటూ జోష్ పెంచుతున్నారు. తనకెంతో ఇష్టమైన 'డియర్ కామ్రేడ్' గురించి మాట్లాడారు. అలాగే విజయ్‌తో ఎంగేజ్‌మెంట్ పైనా స్పందించారు. సినిమా రిలీజ్ అయినప్పుడు కాకుండా కొన్నేళ్ల తర్వాత దాన్ని ప్రశంసిస్తే ఉపయోగం లేదని ఆమె అన్నారు. విజయ్ దేవరకొండ, ఆమె జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'డియర్ కామ్రేడ్'. భరత్ కమ్మ దర్శకుడు. 2019లో విడుదలైన ఈ చిత్రం అనుకున్న స్థాయిలో అలరించలేకపోయింది. ఆ సినిమాకు సంబంధించిన టాక్ బయటకు వచ్చిన తర్వాత కూడా 'దీన్ని ప్రేక్షకుల్లోకి తీసుకువెళ్ల డానికి మనం ఇంకా ప్రయత్నిద్దాం' అని చిత్ర బృందానికి చెప్పాను. కానీ, అది ఫలించలేదు. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఆ సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో, యూట్యూబ్‌లో 'డియర్ కామ్రేడ్' గురించి పోస్ట్‌లు పెడుతున్నారు. ఇది ప్రేక్షకులకు నచ్చుతుందని నేను అప్పుడు చెబితే ఎవరూ వినలేదు.




## యంగ్ ప్రభాస్‌గా దర్శన్

సూపర్ స్టార్ కృష్ణ చిన్నల్లుడు, మహేశ్ బాబు బావ సుధీర్ బాబు ప్రస్తుతం తెలుగు సినిమా రంగంలో హీరోగా తనకంటూ ఓ గుర్తింపును సంపాదించుకున్నాడు. కృష్ణ చిన్నకూతురు ప్రియదర్శిని భర్త అయిన సుధీర్ బాబు తన కొడుకులనూ సినిమా రంగంలోకే తీసుకొస్తుండటం విశేషం. ప్రియదర్శిని, సుధీర్ బాబు జంటకు ఇద్దరు కొడుకులు. పెద్దబ్బాయి చరిత మానస్. ఇతను గతంలో 'భలే భలే మొగాడివోయ్' చిత్రంలో చిన్నప్పటి నాని (ఔజీనితి) గా నటించాడు. అలానే చిన్న కొడుకు దర్శన్ కూడా కొన్ని సినిమాల్లో నటించాడు. 2018లో వచ్చిన 'గూఢచారి'లో చిన్నప్పటి అడివి శేష్ గానూ, 2022లో వచ్చిన 'సర్కారు వారి పాట'లో చిన్నప్పటి మహేశ్ బాబు గానూ దర్శన్ నటించాడు. తాజాగా సుధీర్ బాబు తనయుడు దర్శన్ 'ఫౌజీ' మూవీలో యంగ్ ప్రభాస్ గా నటిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా అతని తండ్రి సుధీర్ బాబు తెలిపాడు. సుధీర్ బాబు నవంబర్ 7న విడుదల కాబోతున్న తన తాజా చిత్రం 'జటాధర' ప్రమోషన్స్ సమయంలో ఈ విషయాన్ని వెల్లడిరచాడు. ఈ సినిమాలో భారీ సంస్కృత సంభాషణలు ఉన్నాయని, వాటిని చాలా సులువుగా, సునాయాసంగా దర్శన్ చెప్పేశాడని యూనిట్ సభ్యులు అంటున్నారు. 'ఫౌజీ' చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న 'ఫౌజీ'తో ప్రభాస్ సరసన ఇమాన్వీ హీరోయిన్ గా నటిస్తోంది.



# మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

- 5 లక్షల కుటుంబాలకు రూ.123 కోట్ల నిధులు మంజూరు
- మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- గణపసముద్రంలో చేప పిల్లల విడుదల

**వరంగల్ వాయిస్, గణపురం :** మత్స్యకారుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం కేంద్రంలోని గణపసముద్రం చెరువులో మంగళవారం మంత్రి వాకిటి శ్రీహరి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలతో కలిసి వంద శాతం రాయితీపై ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇదే సామాజిక వర్గానికి చెందిన వారికి కాకుండా, ఇతరులకు మత్స్యశాఖను కేటాయించి వారి అభివృద్ధికి తోడ్పడలేదన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మత్స్య శాఖను ప్రక్షాళన చేశానని మంత్రి తెలిపారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న చేప పిల్లల ద్వారా ఐదు లక్షల మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మత్స్యకారులను పట్టించుకోలేదని, రాష్ట్రంలోని 5 లక్షల మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి కలిగేలా రూ.123 కోట్ల నిధులు మంజూరు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వానిదన్నారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. మత్స్యకారులు అభివృద్ధి చెందితే గ్రామాల ఆర్థిక వ్యవస్థ బలపడి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. స్థానికంగా చేపల ఉత్పత్తి పెరిగితే గ్రామస్తులకు చవకగా, ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కాలువలు, జలాశయాలు ఉన్నాయని, ప్రణాళికతో ఉపయోగిస్తే మత్స్య ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ కుమార్ స్వామి, చిట్యాల భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి కిష్టన్న, సింగిల్ విండో చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.



## ఆనాడు విమానాల్లో విహరించి..
## ఈనాడు ఆటోల్లో తిరుగుతున్న కేటీఆర్

- ఆటో డ్రైవర్ల గురించి మాట్లాడటం హాస్యాస్పదం
- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు విమానాల్లో విహరించిన ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఇవాళ అధికారం పోగానే ఆటోల్లో తిరగడం, ఆటో డ్రైవర్ల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రహమత్ నగర్ న్యూటన్ పబ్లిక్ స్కూల్ ప్రాంతంలోని వాడవాడలా ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆనాడు ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిందన్నారు. ఇందులో భాగంగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించి, విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమం అంటేనే కాంగ్రెస్ పార్టీ.. కాంగ్రెస్ పార్టీ అంటే విలువల కోసం, ఇచ్చిన మాట కోసం పనిచేసే ప్రభుత్వం అని ప్రతిపక్షాలు గుర్తెరిగి మాట్లాడాలని ఆయన హితవు పలికారు. ప్రజల బాగు కోసం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓట్లు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత ఈ నియోజకవర్గ ప్రజలపైనే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీపై, ప్రభుత్వంపై అవాకులు, చెవాకులు పేలుతున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని బండి సుధాకర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ ఇంటింటి ప్రచారంలో ఆయన వెంట ప్రముఖ సంఘ సేవకులు పీటర్ పాల్, మౌనిక, శ్యాం, బండి జగదీశ్ పాల్గొన్నారు.

## సెలవులు రద్దు

- 24/7 అప్రమత్తంగా ఉండాలి
- మెన్ అండ్ మెటీరియల్స్ సిద్ధంగా ఉంచుకోవాలి
- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

**వరంగల్ వాయిస్, నక్కలగుట్ట :** మొంతా తుఫాను కాకినాడ తీర ప్రాంతాన్ని తాకే అవకాశం ఉందని తాజా వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎన్పీడీసీఎల్ ఉద్యోగుల సెలవులను రద్దు చేసినట్లు సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రకటించారు. రెడ్‌జోన్ ప్రాంతాలైన పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జనగాం, మంచిర్యాల్, ఆసిఫాబాద్, అదిలాబాద్ లో 150 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం సంభవించే అవకాశం ఉన్నందువలన ఫీల్డ్ అధికారులు 24×7 అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రౌండ్ ది క్లాక్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. నష్టం సంభవించిన వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు తగిన సిబ్బంది, సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ అధికారి, సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లోనే ఉండి, అత్యవసర పరిస్థితులలో వెంటనే స్పందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించి, తక్షణ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 16 సర్కిల్ అధికారులు, డివిజన్ అధికారులు ప్రతి గంటకు ఒకసారి విద్యుత్ సరఫరా, నష్టం నివేదిక అందించాలన్నారు. అర్ధరాత్రి సైతం నివేదికలు ఇవ్వాలని కోరారు. ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేటట్లు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన పోల్స్, మెటీరియల్, క్రేన్లు, అవసరమైతే జనరేటర్లు, బ్రేక్ డౌన్ బృందాలు, ఏజెన్సీలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకొని ఎటువంటి విద్యుత్ సమస్యలు ఏర్పడినా యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చేసి విద్యుత్ సరఫరా అందించేలా ఏర్పాట్లు చేయాలని వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు.

## కుడా భూముల విక్రయాలు వద్దు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) భూముల విక్రయాల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ వామపక్ష పార్టీల ప్రతినిధులు మంగళవారం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరిష్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. కుడా భూములను ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు మాత్రమే ఉపయోగించాలని కోరారు. అనంతరం వామపక్ష పార్టీల ప్రతినిధులైన సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి, సీపీఐ కర్రె బిక్షపతి, ఎంసీపీఐ(యూ) ఎనరెడ్డి హంసరెడ్డి, ఆర్ఎస్పీ కొడగాని శివాజీ మాట్లాడుతూ.. నగర అభివృద్ధికి నిధులు లేవన్న సాకుతో హనుమకొండ పట్టణం బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ వెనక ఉన్న 2.34 ఎకరాల ప్రభుత్వ భూమిని నవంబర్ 3న బహిరంగ వేలం వేయాన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలను రక్షించాల్సిన వారే ప్రజా వ్యతిరేక నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ భూమిని అమ్మి వచ్చిన ఆదాయంతో నగరాన్ని అభివృద్ధి చేస్తామని, నగరాన్ని సుందరీకరణ చేస్తామని, బహుళ జాతి కంపెనీలు ఈ భూమిని కొనుగోలు చేసి ఇక్కడ తమ వ్యాపార లావాదేవీలు ప్రారంభిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వం వాదించడం సరైంది కాదన్నారు. కుడాకు ఆదాయం కావాలనుకుంటే ప్రభుత్వ భూములను అభివృద్ధి చేసి లీజుకు ఇవ్వడం ద్వారా, వ్యాపార సముదాయాలు, మల్టిప్లెక్స్ లను కట్టించి అద్దెకు ఇవ్వడం ద్వారా సమకూరుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రెండో రాజధానిగా ఉన్న గ్రేటర్ వరంగల్ మహానగరాన్ని అభివృద్ధి చేయాలంటే అనేక మార్గాలు ఉన్నాయన్నారు. కానీ భవిష్యత్ తరాలకు ఉపయోగపడే నగర నడిబొడ్డున ఉన్నటువంటి విలువైన ప్రభుత్వ భూములను అమ్మడం ద్వారా నగరాన్ని అభివృద్ధి చేస్తామనడం ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమన్నారు. భద్రకాళి గుడిని అభివృద్ధి చేయాలంటే దేవాదాయశాఖ దానిని అభివృద్ధి చేస్తుంది, కానీ ప్రభుత్వానికి ఆదాయం కోసం, వందల కోట్ల విలువైన భూమిని కేవలం రూ.85కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో అమ్మ కానికి పెట్టడం పలు అనుమానాలను కలిగిస్తోందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలనివారు డిమాండ్ చేశారు. ఈ ప్రతినిధి బృందంలో వామపక్ష పార్టీల నాయకులు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, గొడుగు వెంకట్, మంద సంపత్, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదారి శ్రీనివాస్, ఆరెస్పీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామల మోహనరావు, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు కర్ర రాజిరెడ్డి, గద్దం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



### బాలికల పాఠశాల సందర్శన..

**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** పెద్దాపూర్ లోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలను మంగళవారం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరిష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా వైస్ ప్రిన్సిపాల్ చంద్రకళను పాఠశాలకు సంబంధించిన పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య, విద్యాబోధన, ఆరోగ్యం, పరిశుభ్రత మొదలగు విషయాలపై ఆరా తీశారు. రైస్ రూమ్, వంట సరుకులు గదిని పరిశీలించి డీడబ్ల్యూ కవితా రాణిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. వంటగది, భోజన శాల మొదలగు వాటిని పరిశీలించారు. తదుపరి క్లాస్ రూమ్ లకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. ముఖ్యంగా ఐదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కంప్లైంట్ బాక్స్ ను పరిశీలించారు. ఈ తనిఖీలో భాగంగా హనుమకొండ డీసీఓ వెంకట ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, ఆర్సీఓ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com